**రిపోర్టులు**

# మెదడువాపు మరణాలు
# వైద్య వ్యవస్థకు దర్పణం

**2003** సంవత్సరం జులై - ఆగస్టు నెలలలో కరీంనగర్, వరంగల్ జిల్లాలలో కొన్ని వందల మంది పిల్లలు ఏదో కొత్తరకం జ్వరాలకు బలి అయ్యారని పత్రికలలో వార్తలు రావడం ప్రజలను బాగా కలవరపెట్టింది. పత్రికలు ఈ జ్వరాలకు 'విషజ్వరాలు' అని పేరు పెట్టాయి. ఈ మాట ఎప్పుడు పుట్టిందో ఎవరు దీని సృష్టికర్తలో తెలీదుగానీ, డాక్టర్లు పేరుపెట్టలేని అన్ని రోగాలనూ పత్రికలిప్పుడు 'విషజ్వరాలు' అంటున్నాయి.

జులై - ఆగస్టు నెలలలో వ్యాపించిన రోగానికి మెదడువాపు లక్షణాలున్నాయి గానీ అది మామూలుగా వచ్చే మెదడువాపు వ్యాధి కాదని మొదట్లోనే డాక్టర్లు అన్నట్టు పత్రికలు రాశాయి. అది ఏదో క్రిమి ద్వారా వ్యాపిస్తున్నదని మాత్రం గుర్తించారు. అయితే అది ఏ క్రిమో చెప్పగల 'వైరాలజీ' పరీక్ష చేసే పరిశోధనాలయం ఆంధ్రప్రదేశ్‌లో లేదు కాబట్టి పూనా నుంచి, ఢిల్లీ నుంచి పరిశోధకులను రప్పిస్తున్నామన్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి ఆటల స్టేడియంల దాకా ప్రపంచంలో ఎక్కడ ఏది ఉన్నా దానిని ఆంధ్రప్రదేశ్‌కు రప్పించడానికి ఉత్సాహపడే ముఖ్యమంత్రి, వైరాలజీ పరిశోధనాలయం హైదరాబాద్‌లో లేదు, పూనాలోనే ఉందని తెలియగానే 'ఎవరక్కడ! వెంటనే వైరాలజీ పరిశోధనాలయం హైదరాబాద్‌లో నెలకొల్పండి' అని ఆదేశిస్తాడని అనుకున్నాం. ఆయన అటువంటిదేం చేయలేదు. ఆ పరిశోధనాలయాలు రాష్ట్రంలో ఉంటే పేద పిల్లల ప్రాణాలు కొన్ని దక్కుతాయేమోగానీ రాష్ట్ర స్థూల ఆదాయం పెరగదుకదా! దాని అభివృద్ధి రేటు పైకి ఎగబాకదు కదా! అందువల్లనేమో.

రోగ నిర్ధారణ జరగలేదు గానీ పిల్లలు మాత్రం ప్రతిరోజూ చనిపోతూనే ఉన్నారు. రోగం ఏదో తెలీకపోయినా దానికి మెదడువాపు వ్యాధి లక్షణాలు ఉన్నాయి కాబట్టి అదే ట్రీట్‌మెంట్ ఇస్తున్నామని కరీంనగర్‌లో డాక్టర్లు అన్నారు. చంద్రబాబు నాయుడు మొదలుపెట్టిన పద్ధతిని అనుసరించి వారే కాక వారి మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బాధిత ప్రాంతాలకు పోయి వైద్యుల నుంచి గ్రామ సర్పంచ్‌ల దాకా అందరి మీదా ధూం ధాం అంటూ ఎగిరారు. డాక్టర్లను సస్పెండ్ చేయమనీ పందులను చంపమనీ ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ఆదేశాలు జారీచేశాడు.

ఆ రోగం మెదడువాపులో ఒకరకమనీ దానిని మెనింజో-ఎన్‌కెఫాలైటిస్ అంటారనీ ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్లు ప్రకటించేసరికి రోగం ఉధృతి దానంతటదే తగ్గిపోయింది. అసలు ఆ రోగం ఎటువంటిది, దాని నివారణ మార్గాలు ఏమిటి, రోగ లక్షణాలు ఎట్లాంటివి, ఏమి చేస్తే పిల్లల ప్రాణాలు దక్కుతాయి అనే విషయాలు తరువాత ప్రభుత్వం ప్రజలకు తెలియజేసే ప్రయత్నమేం చేయలేదు. అంతలో గోదావరి పుష్కరాలు వచ్చాయి. మెదడువాపును వదిలిపెట్టి పుష్కరాల గురించి ధూంధాం చేయడంలో ప్రభుత్వం నిమగ్నమయింది.

మెదడువాపు ఒకరకమైన క్రిమి ద్వారా వ్యాపించే ప్రాణాంతక రోగం. అది కొన్నిరకాల జంతువుల శరీరంలో అభివృద్ధి చెంది, దోమకాటు ద్వారా ఒక జంతువు నుంచి మరొక జంతువుకు పాకో

క్రిమి. ఇటువంటి క్రిములను వైద్య పరిభాషలో 'ఆర్బోవైరస్' అంటారు. మామూలుగా వచ్చే మెదడు వాపు వ్యాధి ఒక గ్రూప్ 'బి' ఆర్బోవైరస్ వల్ల కలుగుతుంది. ఈ సంవత్సరం వచ్చినది చాందిపుర అనే అర్బోవైరస్ ద్వారా కలిగింది.

మామూలుగా వచ్చే మెదడువాపు వ్యాధిని 'జపనీస్ ఎన్‌కెఫాలైటిస్' అంటారు. ఇది జపాన్, చైనా, కొరియా దేశాలలో అధికంగా ఉండేది. అక్కడి నుంచి ఇతర తూర్పు ఆసియా దేశాలకు పాకి ఇప్పుడు కొన్నేళ్లుగా దక్షిణ ఆసియాలోని ఇండియా, శ్రీలంకలను చేరుకుంది.

2000 సంవత్సరంలో ప్రచురించిన ఒక వైద్య గ్రంథంలో ఇచ్చిన సమాచారం ప్రకారం సాలీనా ప్రపంచ వ్యాప్తంగా సగటున 43 వేల కోసులు వెలుగులోకి వస్తున్నాయని, సగటున 11 వేల మంది చనిపోతున్నారని తెలుస్తున్నది. రోగగ్రస్తులలో దాదాపు 85 శాతం 15 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలే.

ఆర్బోవైరస్ క్రిములు జంతువుల శరీరాలలో పెరుగుతాయి. ఒక జంతువు నుంచి మరొక జంతువుకు దోమ ద్వారా ప్రసారం అవుతాయి. మెదడువాపు క్రిమిని కలిసి ఉన్న జంతువును దోమ కుడితే, ఆ దోమలో రోగం అభివృద్ధి చెందడానికి 9 నుంచి 17 రోజులు పడుతుంది. ఆపైన ఆ దోమ మరొక జంతువును కుట్టినట్టయితే రోగం ఆ జంతువుకు కూడా వ్యాపిస్తుంది.

ఆర్బోవైరస్ క్రిములు ప్రధానంగా పందుల శరీరంలో అభివృద్ధి చెందుతాయి. పందులే కాక బర్రెలు, ఎడ్లు, గుర్రాలు, కోళ్లు, బాతులు మొదలయిన జంతువుల శరీరాలలోనూ అభివృద్ధి చెంద గలవు. ఆ జంతువును కుట్టిన దోమలో రోగం అభివృద్ధి చెందిన తరువాత అది మనిషిని కుట్టినట్ట యితే అది మనిషికి కూడా వ్యాపిస్తుంది. (అయితే ఇది మనిషి నుంచి మనిషికి వ్యాపించదు. అంటే ఒక రోగిని కుట్టిన దోమ మరొకరిని కుడితే వారికి రోగం రాదు)

ఈ కారణంగా మెదడువాపు విషయంలో పందులను ప్రధాన దోషులుగా నిలబెట్టి వాటిని చంపడం, పందుల కాపర్లను ఊర్ల నుంచి తరిమివేయడం జరుగుతున్నది. కానీ మెదడువాపు రోగ క్రిమి పందుల నుంచి నేరుగా మనుషులలోకి రాదు. దోమల ద్వారా మాత్రమే రాగలదు. ఇంటి చుట్టూ ఎన్ని పందులున్నా, దోమలు లేకుండ చూసుకున్నట్టయితే ఈ వ్యాధి రాదు. అంతేకాక, ఒకవేళ పందులన్నిటినీ చంపేసినా లేక తరిమేసినా ఇతర పశువులు, కోళ్లు, బాతుల నుంచి దోమల ద్వారా ఈ క్రిమి మనుషుల రక్తంలోకి ప్రవేశించగలదు. ఆ జంతువులు పందులతో సమా నంగా కాకున్నా ఒక మోతాదులో మెదడువాపు రోగ క్రిమికి 'హోస్ట్'గా వ్యవహరించగలవు. వాటినన్నిటినీ గ్రామీణ ప్రాంతాల నుంచి తొలగించడం సాధ్యపడదు. అవి లేనిదే గ్రామీణ జీవితమే లేదు. పందుల పెంపకందార్లు హైందవ సమాజంలో అతి హీనంగా చూడబడే కులాలకు, తెగలకు (తెలంగాణలో ప్రధానంగా ఎరుకల, వడ్డెర) చెందినవారు కావడం వల్ల మెదడువాపు అనగానే పందులను చంపండి అంటున్నారు గానీ, హైందవ కుల వ్యవస్థలో పందుల పెంపకానికి ఇంకొంత గౌరవనీయమయిన స్థానం ఉండి ఉంటే అది జరిగేది కాదు.

మెదడువాపు క్రిమిని నివారించడానికి ప్రధానంగా చేయవలసింది దోమలను నివారించడం. తొలినాడు ఈ వ్యాధికి నిలయాలుగా ఉన్న జపాన్ వంటి తూర్పు ఆసియా దేశాలు దోమలను సమ ర్థంగా నివారించడం ద్వారానే ఈ వ్యాధిని గట్టిగా నియంత్రించగలిగాయి.

ఎన్‌కెఫాలైటిస్ క్రిమిని వ్యాపింపజేసే దోమను క్యూలిసైన్ దోమ అంటారు. అవి మురుగునీటి

గుంటలలోనూ, వరిమళ్లలోనూ నిశ్చలమైన నీటి వనరులలోనూ వర్ధిల్లుతాయి. వాటిని అరికట్టా లంటే మలాథియన్, ఫెనిట్రాథియన్ మొదలయిన పురుగుల మందులను గాలిలో, నేలమీద, పొలాలపైన, ఇళ్ళ చుట్టూ ఉన్న మొక్కల మీద, స్థిర నీటివనరుల మీద, పశువుల కొట్టాలలో, ఇళ్ళలో స్ప్రే చేయాలి. ఒక గ్రామంలో రోగం పొడచూపినట్టయితే దానికి రెండు మూడు కిలోమీటర్ల పరిధిలో పురుగుల మందు స్ప్రే చేయాలి. ప్రజలు ఒంటినిండా బట్టలు వేసుకోవాలి, దోమతెరలు వాడాలి.

ప్రతీ సంవత్సరం వర్షాకాలం మొదలుకాగానే మెదడువాపు వ్యాధి వ్యాపిస్తూనే ఉంది కాబట్టి పైన చెప్పిన ప్రాథమిక నివారణోపాయాలు ప్రభుత్వ పారిశుధ్య విభాగానికి తెలిసే ఉండాలి. అయితే నివారణ చర్యలేవైనా చేపట్టారా అని కరీంనగర్ జిల్లాలో ఈ వ్యాధిసోకి వందల సంఖ్యలో పసిపిల్లలు చనిపోయిన గ్రామాలలో వాకబుచేస్తే వచ్చే సమాధానం చాలా బాధాకరమైనది. చావులు మొద లయ్యేదాకా ఏ నివారణ చర్యలూ చేపట్టలేదు. పిల్లల చావులను పత్రికలు మరీ అతిగా రాసాయని డాక్టర్లూ వైద్య విధాన పరిషత్ అధికార్లూ గొడవపెట్టారు గానీ పత్రికలే రాయకపోతే ఆ తరువాత కూడా ఏం జరిగేది కాదు.

కానీ చేసిందేమిటంటే, పిల్లలు చనిపోయిన ఇళ్ళలో పురుగుల మందు చల్లడం, లేదా ఆ వీధిలో చల్లడం. పశువుల కొట్టాలలో మందు స్ప్రే చేసిన ఉదంతం ఒక్కటీ లేదు. మురుగునీటి గుంటల మీద మందు చల్లారుగానీ వాటిని పూడ్చే ప్రయత్నం చాలాచోట్ల జరగలేదు. ఇళ్ళ చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలగించే ప్రయత్నంగానీ వాటి మీద పురుగుల మందు చల్లే ప్రయత్నంగానీ జరగలేదు. ఎందుకు జరగలేదన్న ప్రశ్నకు బాధిత గ్రామ పంచాయతీల సర్పంచ్‌లే జవాబు చెప్తు న్నారు. పారిశుధ్యం కోసం చిన్న గ్రామ పంచాయతీలకు ఐదువేల రూపాయలు, పెద్ద గ్రామ పంచాయతీలకు పదివేల రూపాయలు ప్రభుత్వం అనుమతించింది. కొన్ని గ్రామలకు ప్రభుత్వం ఆ సొమ్ము ఇచ్చిందిగానీ చాలా గ్రామాలకు ఆ మేరకు తమ పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేసుకోవ డానికి అనుమతి మాత్రమే ఇచ్చింది!

'హుటాహుటిన', 'యుద్ధ ప్రాతిపదికన' మొదలయిన మాటలు ముఖ్యమంత్రి తరచుగా వాడుతుంటాడు. వాటిని ఈ పిసినారితనంతో జతచేసి చూసుకున్నప్పుడు తప్ప అసలు విషయం అర్థం కాదు.

ఇది నివారణ సంగతి.

చికిత్స సంగతి చూద్దాం. దోమకాటు ద్వారా మెదడువాపు క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశించిన తరువాత 5 నుంచి 15 రోజులకది రోగం రూపం తీసుకోగలదని అంచనా. (అందరికీ రోగం రానక్కరలేదు. క్రిమిసోకిన వారిలో సగటున 500 మందిలో ఒకరు మాత్రమే రోగగ్రస్తులవుతారని అంచనా) మొదటిదశలో జ్వరం, తలనొప్పి, బలహీనత రోగలక్షణాలు. ఒకటి నుంచి ఆరు రోజుల లోపల ఇది రెండవ దశను చేరుకోగలదు. రెండవ దశలో విపరీతమైన జ్వరం కాస్తుంది. ఫిట్స్ వస్తాయి. ఈ దశను దాటితే బతికినట్టే, కానీ దానికో సత్వరం, సమర్థం అయిన చికిత్స అవసరం. రోగం సోకిన తొలి దినాలలోనే అటువంటి చికిత్స దొరకకపోతే ప్రాణం దక్కడం కష్టం. సగటున తొమ్మిది రోజులలో ప్రాణం పోతుందని వైద్య గ్రంథాలు అంటాయి గానీ మొన్న కరీంనగర్, వరం గల్ జిల్లాలలో చనిపోయిన పిల్లలు ఎక్కువగా రెండు మూడు రోజులలోనే చనిపోయారు.

కాబట్టి దగ్గరిలోనే సమర్థమైన వైద్య సదుపాయం దొరకకపోతే పిల్లల ప్రాణం దక్కదని అర్థం అవుతుంది. కానీ ఇదే లోపించింది. గ్రామీణ ప్రజలకు అందుబాట్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) స్థితి అధ్వాన్నంగా ఉంది. కరీంనగర్ జిల్లాలో పిల్లలు ఎక్కువ సంఖ్యలో చని పోయిన మండలాలలో సుల్తానాబాద్ ఒకటి. ఆ మండలం ప్రజలకు సుల్తానాబాద్ పిహెచ్‌సి అతి సమీపంలోని ఆస్పత్రి. జులై 3 నుంచి 20 దాకా ఈ ఆస్పత్రికి 400 మంది మెదడువాపు రోగులు చికిత్స కోసం వచ్చారు. అందులో 30 మందిని ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ చేసుకున్నారు. 20 మం దిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఈ ఆస్పత్రి దుస్థితి ఏమిటంటే అందులో వైద్యుల పోస్టులు 4 ఉండగా 3 ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒక్క డిప్యూటీ సివిల్ సర్జన్ ప్రతీ రోజూ పొద్దున్న 7 నుంచి రాత్రి 9 గంటల దాకా పనిచేసి ప్రజలచేత మంచివాడనిపించుకున్నాడు గానీ, అతను ఎంత న్యాయం చేయగలిగి ఉంటాడు?

ప్రాథమిక ఆరోగ్యం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ ఆపైన ప్రైవేట్ రంగానికి వదిలిపెట్టడం మేలనీ ప్రపంచ బ్యాంకు ఆదేశించిన సంగతీ చంద్రబాబు ఆమోదించిన సంగతీ కూడ మనకు తెలుసును. నిజానికి చంద్రబాబు ఒకడుగు వెనక్కిపోయి వైద్య వ్యాపారంలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వికాసానికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని విజన్ 2020లో ప్రకటించిన సంగతి కూడా మన మెరుగుదుము. ప్రైవేట్ వైద్య వ్యాపారం ఉన్నవాళ్ల అవసరాలు తీరిస్తే ప్రభుత్వం లేనివాళ్ల అవసరాలు చూసుకోవచ్చును కదా, ఇందులో వైరుధ్యం ఏముందని అనవచ్చును. ప్రైవేట్ వైద్యం అసలే ఉండవద్దని కాదుగానీ ప్రధాన వైద్యరంగాన్ని అది ఆక్రమించుకుంటే ప్రభుత్వరంగంలో ఏమున్నదీ లేనిదీ చూసేవారూ అడిగేవారూ ఎవరూ ఉండరు. కేవలం దరిద్రులు మాత్రమే పొందే సేవలు బాగున్నా లేకపోయినా ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టే వారెవరుంటారు? కానీ కేవలం దరిద్రు లకు మాత్రమే వచ్చే రోగాలకు ప్రభుత్వరంగంలో తప్ప వేరే ఎక్కడా చికిత్స దొరకదు. వేరే ఎవరికీ ఈ వర్గాలకు చికిత్స చేయడం లాభదాయకం కాదు. మరి ప్రైవేట్ ఆస్పత్రులే ప్రధాన చికిత్సాలయా లుగా మారిన నేటి పరిస్థితిలో పేదలకు మాత్రమే వచ్చే రోగాలకు సమర్థమయిన చికిత్స దొరకా లంటే సాధ్యమా?

ప్రైవేట్ చికిత్సా వ్యవస్థలో అనేక రోగాలకివాళ వైద్యం దొరుకుతున్నది. వరంగల్ సాపేక్షంగా పెద్ద పట్టణం కాబట్టి దానికంటె కరీంనగర్‌ను ఉదాహరణగా తీసుకోవడం ఉచితంగా ఉంటుంది. కరీంనగర్ పట్టణంలో క్లినిక్‌లు, ఆస్పత్రుల బోర్డులు చూసుకుంటూ తిరిగినట్టయితే ఫెర్టిలిటీ క్లిని క్‌లు, ఒబీసిటీ క్లినిక్‌లతో సహా అనేకరకాల ప్రత్యేక వైద్యసేవాలయాలు కనిపిస్తాయి. ఇవి అనవసరం అని కాదు గానీ వాటి సరసన ఎక్కడా ఎన్‌కెఫాలైటిస్ క్లినిక్‌లుగానీ అతిసార వ్యాధి చికిత్సాలయాలు గానీ కనిపించవనేది గమనించడం అవసరం. ఆ రోగాలు సాధారణ చికిత్సా కేంద్రాల బాధ్యతే.

అయినా ఆ ఫీజులు చెల్లించుకునే స్థోమత మెదడువాపు బాధితులలో మెజారిటీకి లేదు కాబట్టి వారంతా ప్రభుత్వ ఆస్పత్రులకో వెళ్లారు. నయం చేసినా చేయకున్నా వారిని చూసుకున్నది ప్రభుత్వ ఆస్పత్రులే. కరీంనగర్‌లో నయంకాని పిల్లలు వరంగల్ గాంధీ దవాఖానాకో, హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానాకో పోయారు తప్ప అపోలోకు పోలేదు, యశోదాకు పోలేదు. అయితే ఈ వర్గం ప్రజలు మాత్రమే వచ్చే ఆ చికిత్సా కేంద్రాలు ఎంత మెరుగయిన సేవలు అందించగలుగుతున్నాయని అడిగే ఆసక్తి ఎవరికీ లేదు. అడిగితే జవాబు చెప్పేవారూ లేరు.

చివరిగా, పరిసరాల పారిశుధ్యం గురించి ఏ పట్టింపూ లేకుండా, రోగాలు వచ్చినప్పుడు ఆర్భాటంగా పందులను చంపే ఈ వైఖరి గురించి మా మాటలలో కాకుండా రాష్ట్ర హైకోర్టు మాటలలో చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. ఇది 23 ఏళ్ల కింద ఇచ్చిన తీర్పు! హైదరాబాద్ నగరంలో మెదడువాపు వ్యాధికి కారణం అవుతున్నాయంటూ పందులను చంపే మునిసిపల్ కార్పొరేషన్ వారి కార్యక్రమాన్ని ఉదేశించి,

> పందుల యజమానులు లైసెన్స్ తీసుకొని మునిసిపల్ కార్పొరేషన్ చట్టానికి లోబడి తమ వ్యాపారం నడుపుకునేటట్టు చూడడం కార్పొరేషన్ బాధ్యత. ఏళ్ల తరబడి లైసెన్స్‌ల గురించి పట్టించుకోకుండా రోగాలు వ్యాపించిన సంవత్సరాలలో మాత్రం మేల్కొని చట్టాన్ని అమలు చేయాలని ప్రయత్నించడం, అత్యధికంగా షెడ్యూల్డు కులాలకు చెందిన పేద ప్రజలయిన పందుల యజమానులను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. వీరికి తెలియ చెప్పి లైసెన్స్‌లు తీసుకునేటట్టు, చట్టం ప్రకారం నడుచుకునేటట్టు చూడడం కార్పొరేషన్ బాధ్యత. చట్టం ఇచ్చే అధికారాన్ని వినియోగించేటప్పుడు పందుల యజమానులు నిరక్షరాస్యులన్న విషయాన్ని గుర్తెరిగి, అవసరమైన మేరకు మాత్రమే కార్పొరేషన్ అధికారులు తమ అధికారాలు ప్రయోగిస్తారని ఆశిస్తాం. అకస్మాత్తుగా పందుల మీదపడి వాటిని ఏరి వేయడం కార్పొరేషన్ ఈ భయంకర వ్యాధి మీద గొప్ప పోరాటం చేస్తున్నదన్న అభిప్రాయాన్ని కలిగించడానికి మాత్రమే పనికొస్తుంది. వారి నిజమయిన కర్తవ్యం అదికాదు. పందుల యజమానులు లైసెన్స్‌లు తీసుకొని పందులను పరిశుభ్ర ప్రదేశాలలో ఉంచి వీధుల వెంబడి తిరగకుండా ఉండేటట్టు చూసుకునే విధంగా కట్టుదిట్టం చేయడం కార్పొరేషన్ అసలు బాధ్యత. అంతకంటే ముఖ్యమైన పని, నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న దోమల బెడదను అరికట్టడానికి కార్పొరేషన్ పెద్దఎత్తున చర్యలు చేపట్టడం.

ఇది 1980లో అప్పటి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి ఇచ్చిన తీర్పు ముగింపు భాగం. 1987లో దీనిని మరింత విశదీకరిస్తూ, హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ఆదిమ జాతి సేవా సంఘం వేసిన కేసులో కొన్ని నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీచేసింది. ప్రతీ మునిసిపాలిటీ ఆ పట్టణం వెలుపల మరీ దూరాన కాకుండా పందుల కాపర్లకు స్థలాలు కేటాయించాలి. ఏకపక్షంగా చేయకుండా, రెండు మూడు ప్రత్యామ్నాయాలు వారికి చూపించి వారిని ఎంచుకోమనాలి. అన్ని పందులకూ లైసెన్స్‌లు ఇవ్వాలి. పునరావాస స్థలానికి తరలిపోవడానికి అవసరమయిన అన్నిరకాల సహాయం వారికి అందివ్వాలి. ఆ పైన ఏవయినా పందులు మెడలో లైసెన్స్ లేకుండా పట్టణ వీధులలో తిరుగుతున్నట్టయితే వాటిని చంపవచ్చును.

ఇవి మునిసిపల్ పట్టణాలకు సంబంధించిన తీర్పులే అయినప్పటికీ వీటి స్ఫూర్తి గ్రామ పంచాయతీలకు కూడా వర్తిస్తుంది. అయితే ఇన్ని సంవత్సరాలు గడిచినా ఈ తీర్పుల స్ఫూర్తినిగానీ, ఆదేశాలను గానీ మన రాష్ట్రంలోని స్థానిక సంస్థల అధికారులు అమలు చేసిన పాపాన పోలేదు. పారిశుధ్యం గురించి ఏమీ చేయకుండా కాలక్షేపం చేస్తుండడం, దోమల బెడద తగ్గడానికి ఏ చర్యలూ చేపట్టకుండా ఉండడం, మెదడువాపు వ్యాధి సోకగానే మాత్రం హుటాహుటిన బయలుదేరి యుద్ధప్రాతిపదికన పందులను చంపడం – ఇది ఒక వార్షిక తంతు అయిపోయింది.

**–కరీంనగర్, వరంగల్ జిల్లా కమిటీలు**